క్లుప్తంగా

ఇందిరమ్మ సర్వే పరిశీలన



వైరా 16 వార్డులో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా జాగ్రత్తగా సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

రైల్వే లైన్ నిర్మాణానికి ఇళ్ల కూల్చివేత



ఇళ్లను తొలగిస్తున్న దృశ్యం

మధిర: మధిర పట్టణంలో 3వ రైల్వే లైన్ నిర్మాణానికై అడ్డుగా ఉన్న ఇళ్లను గురువారం కూల్చివేశారు. ఇప్పటికే భూసేకరణలో భాగంగా రెవెన్యూ అధికారులు ఇల్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం అందజేశారు. దీంతో ఇప్పటివరకు మధిర పట్టణంలో మూడో లైన్ నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న అడ్డంకి తొలగిపోయింది. మధిర పట్టణానికి రెండు వైపులా 3వ లైన్ ట్రాక్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యాయి. పట్టణ నడిబొడ్డున రైల్వే ట్రాక్‌కు అనుకొని ఉన్న ఇళ్లను తొలగిస్తున్నారు. ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించిన కట్టడాలను, ఇళ్లను జేసీబీలతో తొలగిస్తుండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో బాబా విగ్రహాలకు గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శ్రీసాయికి కర్పూర హారతులిచ్చి పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలోని శ్రీసాయి ఆలయంలో ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అడవిరావులపాడు గ్రామానికి చెందిన ఆకుల హనుమంతరావు – సారిక దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటస్వామి, సత్యనారాయణ, తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెన్నవల్లి, పెద్ద కోరుకొండి గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ రామిరెడ్డి తెలిపారు. పెద్దకోరుకొండి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో స్వల్ప మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

అంగన్‌వాడీల అక్రమ అరెస్ట్‌ను ఖండించండి

సత్తుపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఛలో హైదరాబాద్ వెళ్తున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేయటాన్ని సీఐటీయూ జిల్లా నాయకులు సర్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. అరెస్ట్ అయిన వారిలో ఉదయశ్రీ, నాగేంద్ర, రామేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

బస్సులు పెంచాలని వినతి

సత్తుపల్లిటౌన్: ఉచిత బస్సు ప్రయాణానికి తగినట్టుగా బస్సులు పెంచాలని డిపో సీనియర్ అసిస్టెంట్ బాబురావుకు గురువారం మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందించారు. పండుగుల సీజన్ కావటంతో రద్దీ ఎక్కువగా ఉంటుందని తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పాకలపాటి జాన్సీ, చావా కవిత, ప్రభావతి, సత్యవతి, కళావతి, సీత పాల్గొన్నారు.

పరామర్శ..

వేంసూరు: మండలంలోని పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య గురువారం పరామర్శించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉడతనేని కృష్ణారావును పరామర్శించారు. అదే విధంగా సీపీఎం నాయకుడు కొత్త సత్యం చిన్న కుమారుడు వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన నున్న విజయ రామారావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, దొడ్డ వెంకటకృష్ణారెడ్డి, మశ్వరరెడ్డి, రమేష్, సురేష్ నాయకులు ఉన్నారు.

సర్వం సిద్ధం

సత్తుపల్లిలో వంద పడకల ఆస్పత్రి

- ఇక ఇక్కడి నుంచే ఎమర్జెన్సీ సేవలు
- పది కన్సల్టెన్సీ రూముల నిర్మాణం



సత్తుపల్లి వంద పడకల ఆస్పత్రి నూతన భవనం

సత్తుపల్లి: తెలంగాణ – ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన సత్తుపల్లి పట్టణంలోని వంద పడకల ఆస్పత్రి సర్వం సిద్ధమైంది. రూ.34 కోట్లతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీ+2 పద్ధతిలో 94,002 ఎస్‌ఎఫ్‌టీలలో మూడు అంతస్తుల్లో నూతన భవన నిర్మాణం చేపట్టింది. 1976లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 50 పడకల ఆస్పత్రిగా నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరటంతో అప్పటి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వినతితో సీఎం కేసీఆర్ నూతన భవన నిర్మాణానికి మంజూరు ఇచ్చారు. 2022లో నిర్మాణ పనులు చేపట్టింది. పనులు వేగవంతం చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పలుమార్లు ఆస్పత్రి నిర్మాణ పనులను సమీక్షించి నిధుల విడుదలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఆస్పత్రి పర్నీచర్ కోసం ప్రత్యేకంగా రూ.2 కోట్లు నిధులను విడుదల చేయించి పనులను చేపట్టడంతో ప్రారంభోత్సవానికి సిద్ధమౌతుంది.

అత్యంత ఆధునాతనంగా..

ఆస్పత్రి భవన నిర్మాణం కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా తీర్చిదిద్దారు. మూడంతస్తుల నిర్మాణంలో ఐదు ఆపరేషన్ థియేటర్లు, 19 వార్డుల విభాగాలు, ఐదు ఐసీయూ బెడ్లు, 98 బెడ్స్ ఏర్పాటు చేశారు. ప్రతి బెడ్‌కు ఆక్సీజన్ అందించే వీలుగా నూతన టెక్నాలజీతో సదుపాయాలను ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రేడియాలజీ, ఫిజియోథెరపీ విభాగం, ఐసీటీసీ, ఆరోగ్యశ్రీ, కాజువాల్టీ బ్లాక్, లాండ్రి, మొదటి అంతస్తులో జనరల్ మెడిసెన్, జనరల్ సర్జరీ, ఐసీసీ వార్డు, అడ్మినిస్ట్రేషన్ వార్డు, బ్లడ్‌బ్యాంక్, సెంట్రల్ ల్యాబ్, రెండో అంతస్తులో 98 బెడ్లతో వార్డు, 15 బెడ్లతో నగదు చెల్లింపు గదులను ఏర్పాటు చేశారు.

60 మంది వైద్యులచే..

వంద పడకల ఆస్పత్రి ప్రారంభమైతే 60 మంది వైద్యులను ప్రభుత్వం నియమిస్తుంది. 30 మంది నర్సింగ్ స్టాఫ్, ఏఎన్‌ఎంలు ఆరుగురు, ల్యాబ్ సౌకర్యం మెరుగౌతుంది. వీరిలో సివిల్ సర్జన్లు 10 మంది, డిప్యూటీ సివిల్‌సర్జన్లు 10 మంది, సివిల్ అసిస్టెంట్లు 28 మంది, ఫిజిషియన్, జనరల్ మెడిసెన్ వైద్యుల సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం కేవలం తొమ్మిది మంది వైద్యులు, తొమ్మిది మంది నర్సింగ్ స్టాఫ్, ఐదుగురు ఏఎన్‌ఎంలు మాత్రమే సేవలందిస్తున్నారు. ఇకపోతే రోగులను పరీక్షించేందుకు పది గదులను కేటాయించటంతో వైద్య సేవలు అందించటం మెరుగౌతుంది.

ఇక రిఫర్ చేయాల్సిన పనిలేదు..

ఖమ్మం–అశ్వారావుపేట జాతీయ రహదారి కావటంతో నిత్యం రోడ్డు ప్రమాదాల అత్యవసర కేసులు నమోదు అవుతుంటాయి. ఆస్పత్రిలో ఎముకల డాక్టర్, జనరల్ ఫిజియన్, బ్లడ్ బ్యాంక్, ఐసీయూ ఉండటంతో అత్యవసర సేవలకు ఇక విఘాతం ఉండదు. సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రి నుంచి ఇక ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి రోగులను రిఫర్ చేయాల్సిన అవసరం ఉండదు.

దయాలసిస్ సేవలు విస్తృతం...

దయాలసిస్ సేవలకు అంతరాయం లేకుండా అందించవచ్చు. ప్రస్తుతం ఆస్పత్రిలో కేవలం ఐదు దయాలసిస్ బెడ్స్ ఉండటం 24 గంటలు సేవలు అందిస్తున్న రోగులకు సరిపడా వైద్య సేవలు అందటం లేదు. నూతన ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయిన వెంటనే పది బెడ్లను దయాలసిస్ సెంటర్‌కు తరలించేందుకు ఇప్పటికే బెడ్లు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలోని దయాలసిస్ రోగులకు ఉపశమనం కలుగుతుంది.

ఆస్పత్రి నిర్మాణం పూర్తయింది..



వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయింది. సత్తుపల్లి ప్రాంతంలో అత్యవసర వైద్య సేవలు మెరుగవుతాయి. డాక్టర్లు, స్పెషలిస్టులు అందుబాటులో ఉంటారు. 24 గంటల వైద్య సేవలు అందిస్తారు. త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

– కె.వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్, సత్తుపల్లి

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి



గోవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసికి ఈ సంవత్సరం కేటాయించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను పూర్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి ఆదేశించారు. గురువారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీని సందర్శించారు. ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను తెలుసుకున్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని చేయాలని, వినియోగదారులకు సకాలంలో నాణ్యమైన బొగ్గును అందించాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మరణించిన జేవీఆర్ ఓసీ డిప్యూటీ సూపరింటెండెంట్ కొప్పుల గోవర్ధన్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈయన వెంట జీఎం ఎం.షాలేంరాజు, జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్, కిష్టారం పీఓ ఎం.నర్సింహారావు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేయండి..

ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు సమష్టిగా కృషి చేయాలని సింగరేణి డీజీఎం ఎస్.యోహాన్, పీఓ నర్సింహారావు అన్నారు. సంక్షేమం కోసం సంస్థ తీసుకుంటున్న కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం కె.హనసుమలత, పర్సనల్ డీజీఎం శివకేశవరావు, ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణరాజు, ప్రాజెక్టు ఇంజనీర్ రమణారావు, రక్షణ అధికారి కిషోర్, సంక్షేమ అధికారి సందీప్, ఫిట్ సెక్రటరీ బాలాజీ, కిషోర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



ఎర్రుపాలెం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేందర్



ముదిగొండ: మాట్లాడుతున్న ఎంపీఓ వాల్మీకి కిషోర్

మధిర/ఎర్రుపాలెం/ముదిగొండ: ప్రతీ ఒక్క రాజకీయ పార్టీ ఎన్నికల నియమావళి తప్పక పాటించాలని ఎంపీడీఓలు వెంకటేశ్వర్లు, సురేందర్, ఎంపీఓ వాల్మీకి కిషోర్ తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి.. గురువారం మధిర, ఎర్రుపాలెం, ముదిగొండ స్థానిక మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి డ్రాఫ్ట్, పోలింగ్ స్టేషన్ల ప్రచురణపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. ఇప్పటివరకు ఎటువంటి అభ్యంతరాలు రాలేదన్నారు. సమావేశంలో మండలపరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ బాస్కర్‌రావు, కాంగ్రెస్, సీపీఎం, బీఆర్ఎస్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



తల్లాడ తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కొణిజర్ల: ఖమ్మం జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని లాలాపురంలో ఎస్‌డీ పాషా అధ్యక్షతన నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించకుండా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం సాధ్యం కాదన్నారు. ఈ సమావేశంలో చలపతిరావు, పురుషోత్తం, నరసయ్య, ప్రభాకర్, బాబు, వినయ్, సతీష్, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ధర్నా..

తల్లాడ: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అన్నారు. గురువారం ఈ మేరకు తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యానికి రూ.500 బోనస్ మాదిరిగానే వేరే పంటలకు కూడా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ రైతు సంఘం నాయకులు తాతా బాస్కర్‌రావు, సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఫకీరమ్మ, వెంకటనరసయ్య, కృష్ణయ్య, మోహన్‌రావు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



వైరాలో బాలికలతో కబడ్డీ ఆడుతున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్



సత్తుపల్లిటౌన్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

వైరా: విద్యార్థులు, యువతీ, యువకులకు చదువులతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని వైరా సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో చక్కగా రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, గురుకుల ప్రిన్సిపల్ సమత, పీడీ శ్రీదేవి, కృష్ణమూర్తి, వీరభద్రం పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీఎస్ఎస్ హైస్కూల్‌లో గురువారం జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. వాలీబాల్, ఖోఖో, కబాడీ, పుడ్‌బాల్, అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్.యాకోబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఆటల పోటీలు గురువారంతో ముగిశాయి. మండలంలోని 31 జీపీల నుంచి 325మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావులు ప్రారంభించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడా నిర్వాహణా కార్యదర్శులు ఫిజికల్ డైరెక్టర్ భీమా, పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్య, పీడీలు రాధాకృష్ణ, రమాదేవి, త్రివేణి, పద్మ, పాపారావు, కల్లూరు గేమ్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహదేవపురం విద్యార్థిని ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకున్న సంధ్యారాణి

మధిర: జిల్లాస్థాయి గణిత టాలెంట్ టెస్టులో మధిర మండల పరిధిలోని మహదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సంధ్యారాణి ఉత్తమ ప్రతిభ కనబరిచింది. తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 11న ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో సంధ్యారాణి ప్రథమ బహుమతి సాధించింది. ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైంది. దీంతో ఆమెను గణిత ఉపాధ్యాయుడు సుధాకర్, హెచ్‌ఎం సాధు, ఉపాధ్యాయులు అభినందించారు.

ద్వితీయ స్థానం..

ఎస్ఎస్‌సీ రాష్ట్రస్థాయి గణిత ప్రతిభాపరీక్షకు మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్ రమ్య ఎంపికైయిందని, ఆమె జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం సాధించిందని పాఠశాల హెచ్‌ఎం తోట నరసింహారావు తెలిపారు.

జీవితంలో సైన్స్ అంతర్భాగం



ప్రశ్నాపత్రం ఆవిష్కరిస్తున్న ఎంఈఓ ప్రభాకర్

మధిర: మానవుని జీవితంలో సైన్స్ అంతర్భాగమని మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. మధిర టీవీఎం పాఠశాలలో గురువారం మండల స్థాయిలో బయాలజీ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సైన్స్‌పై ఎన్నో పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ పోటీ పరీక్షను పోలె సుధాకర్ పర్యవేక్షించగా బయాలజీ ఫోరం సభ్యులు జ్ఞానేశ్వరరావు, భట్టాచారి, శోభామాలిని, కృష్ణప్రియ, ఏసుపాదం, నాగేశ్వరరావు, ఆర్ బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భరత్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వెంకటరెడ్డి

మధిర: మధిర పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత పోటీల్లో భరత్ టెక్నో స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. క్విజ్ పోటీల్లో చిన్మయి ప్రథమ బహుమతి, భగవద్గీత శ్లోక పఠన పోటీల్లో అన్విత తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం ఆ పాఠశాలలో భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి అభినందించారు.

వితరణల వెల్లువ..

క్రీడామైదానానికి రూ.లక్ష



క్రీడామైదానం చదును చేస్తున్న దృశ్యం

ఏన్కూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని క్రీడామైదానం బాగా లేకపోవడంతో స్పందించిన నారాయణ, బసవమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరావు రూ.లక్ష వితరణ చేశారు. దీంతో మైదానానికి గ్రావెల్ తోలించి చదును చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం, అధ్యాపకులు, ట్రస్ట్ సభ్యులు నాగేశ్వరరావు, పిచ్చయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రభుత్వ కళాశాలకు ప్రింటర్..



ప్రింటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శ్రీబండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల 1970–72 పూర్వ విద్యార్థులు గురువారం కళాశాలకు రూ.11వేలు విలువైన ప్రింటర్‌ను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు కొత్తూరు ప్రభాకర్‌రావు, బొబ్బిలి ఆదాం, కొక్కొండ చంద్రశేఖర్‌రావు, మస్తాన్ వలీ, రఘుపతిరెడ్డి, పుల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, సుందరయ్య, మేడా కేశవరావు పాల్గొన్నారు.

తోపుడు బండి..



నిరుపేద మహిళకు తోపుడు బండి అందజేస్తున్న పర్పుల్ డీఎన్‌ఏ సభ్యులు

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామానికి చెందిన నిరుపేద మహిళకు పర్పుల్ డీఎన్‌ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాసరావు, డాక్టర్ నాగసుధ సహకారంతో సంస్థ వైరా కోఆర్డినేటర్ ఉపేందర్‌రావు రూ.10 వేలు విలువ చేసే తోపుడు బండిని మహిళకు అందజేశారు. సొసైటీ సభ్యులు మిట్టపల్లి భాస్కర్ బద్రీనారాయణ, కట్ల సురేష్, శబరి, గోపి పాల్గొన్నారు.

మూతబడిన ఎమ్మార్సీ కార్యాలయం



మూత పడ్డ ఎమ్మార్సీ భవనం

కొణిజర్ల: సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. గత మూడు రోజులుగా ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు వారంతా రిలేదీక్షలు చేపడుతూ విధుల్లోకి రాకపోవడంతో కొణిజర్ల మండల ఎమ్మార్సీ భవనం మూత పడింది. రోజువారీ కార్యక్రమాలు నిలిచిపోయాయి. మండలంలోని విద్యార్థుల వివరాలు, ఉపాధ్యాయుల వివరాలు జిల్లాకు చేరవేసే పనులు, కస్తూర్బా గాంధీ విద్యాలయం బోధన నిలిచిపోయింది. సమ్మెలో ఎమ్మార్సీ సీఆర్‌పీలతో పాటు కేజీబీవీ టీచింగ్, నాన్‌టీచింగ్, సీసీఓ, ఎంఎస్ కోఆర్డినేటర్, పీటీఐ, ఐఆర్‌పీలు సమ్మెలో ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ కరుణశ్రీ

ఏన్కూరు: రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయాలని వైరా ఏడీఏ కరుణశ్రీ కోరారు. గురువారం మండలంలోని మేడేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతుందని తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మన ప్రాంతంలో ఆయిల్‌పామ్ పంట బాగ పండుతుందన్నారు. మనకు దగ్గరలోనే అంజనాపురం దగ్గర మిల్లు తయారు అవుతుందని, ప్రస్తుతం ఆయిల్‌ఫామ్ టన్ను ధర రూ.20 వేలు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరసింహారావు, ఏఈఓలు లహరి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

వేంసూరు: తెలంగాణ స్టేట్ సీడ్ కార్పొరేషన్ ఖమ్మంకు చెందిన వరి విత్తనాలు ఎంటీయూ 1010 రకం విత్తానాలు శుక్రవారం నుంచి రైతులకు విక్రయిస్తున్నట్లు ఏఓ రామ్మోహన్ తెలిపారు. ఎంటీయూ 1010 రకం చెందిన వరి విత్తానాలు 160 బ్యాగుల వేంసూరు రైతు వేదిక వద్ద అందుబాటులో ఉన్నాయని, 25 కిలోల బస్తా ధర 745కు విక్రయిస్తునట్లు తెలిపారు.

రుణమాఫీ చేయాలి

కొణిజర్ల: ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొండవనమాల, కొత్త కాచారం, పాత కాచారం, చిన్నముసగాల, చిన్నగోపతి, పెద్దగోపతి, అమ్మపాలెం గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా ఇస్తానని చెప్పి సీఎం రేవంత్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రమేష్, కోటేశ్వరరావు, లక్ష్మయ్య, రామారావు,. చిన్నవెంకటి, మురళి పాల్గొన్నారు.

సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శిగా వీరభద్రం



వీరభద్రం

కొణిజర్ల: సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శిగా కొణిజర్లకు చెందిన భూక్యా వీరభద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధ, గురువారాల్లో మండలంలోని సింగరాయపాలెంలో సీపీఎం వైరా డివిజన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భూక్యా వీరభద్రంతో పాటు మండలానికి చెందిన తాళ్లపల్లి కృష్ణ, చెరుకుమల్లి కుటుంబరావు, దొడ్డపనేని కృష్ణార్జునరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, తాతా పద్మలను డివిజన్ కమిటీలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గిరిజన, గిరిజనేతరులు సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మహాసభ జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఆటో మోటార్ సభలు..



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కల్లూరు: ఈ నెల 15న ఖమ్మం రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే జిల్లా ఆటో మోటార్ మహాసభలను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా నాయకుడు ఖమ్మంపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కల్లూరు పట్టణంలో మహా సభలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక వాగ్దానాలలో భాగంగా ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిందని, కానీ.. నేటి వరకు ఆ హామీ నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో ట్రాలీ ఆటో సంఘం నాయకులు నరసింహారావు, వెంకటేశ్వర్లు, వేణు, ఆ వాసుదేవరావు, ఆటో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

14,15 తేదీల్లో యూటీఎఫ్ సభలను..

వేంసూరు: ఈ నెల 14,15 తేదీల్లో సత్తుపల్లిలో జరగనున్న యూటీఎఫ్ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆ శాఖ జిల్లా కార్యదర్శి నిర్మల కుమారి అన్నారు. గురువారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సత్తుపల్లి డివిజన్ ఉపాధ్యాయుల చిరకాల కోరిక ఆయిన డివిజన్ బిల్డింగ్ ప్రారంభోత్సవం ఉన్నందున యూటీఎఫ్ సంఘంకు చెందిన ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, ఈశ్వరచారి, శ్రీనివాసరెడ్డి, రాంబాబు, కిషోరి, పుష్ప, హేమలత, జమీలభేగం పాల్గొన్నారు.